పరుగు... పరుగు...

అధికార పీఠం కోసం... స్వపక్షం... విపక్షం భేదం లేదు. లక్ష్యం ఒక్కటే! పరుగు... పరుగు... ప్రగతిపథంలోకి ప్రజల్ని పరిగెత్తించాలని... రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాలనీ... పరుగు... పరుగు...

* * *

అధికార పీఠం అధిరోహించాలంటే సొమ్ములు కూడబెట్టాలి. జనాల్ని కూడబెట్టాలి. అయినా తన్నుమాలిన ధర్మం లేదు గదా! ముందుచూపు, వెనుక చూపూ రెండూ వుండాలి. భైరవమూర్తి గారిలో ఆ లక్షణాలన్నీ నిండుగా, దండిగా వున్నాయి. రాబోయే ఎన్నికలలో కాబోయే 'నేత' ఆయనేనని అంతా అనుకొంటున్నారు. ఆ దిశగానే ఆయన పరుగుతీస్తున్నారు.

ఆయనగారి నియోజకవర్గ పరిధిలో సాంఘిక సంక్షేమశాఖవారు వెనుకబడిన తరగతుల బాలబాలికల కోసం రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం కోసం నాలుగు కోట్ల రూపాయలు సేంక్షన్ చేసారు. జిల్లాలో క్లాసవన్ కాంట్రాక్టరుగా భైరవమూర్తిగారు అవలీలగా నిర్మాణ కాంట్రాక్టుని దక్కించుకున్నారు. ఉరుకులు పరుగుల మీద పనులు నడిపించి, నిర్మాణం స్లాబ్‌వర్క్ వరకూ పూర్తిచేసారు. యిక ఫినిషింగ్ వర్క్ మాత్రం తరువాయిగా వుంది.

నిర్మాణ కార్యక్రమాలను పర్యవేక్షించడానికి ఇ.ఇ. గారు సపరివారంగా వేంచేసారు. వాతావరణం అనుకూలించకపోవడం వల్ల ఆ రాత్రికి ప్రక్క టౌనులో ప్రభుత్వ అతిధిగృహం ఖాళీలేక భైరవమూర్తిగారి ఫామ్‌హౌస్‌లో విడిదిచేసారు.

వి.వి. సుబ్బరాజు

భైరవమూర్తిగారు ఏర్పాటు చేసిన మందు, విందు, పొందులను స్వీకరించి, పరవశించిపోయారు.

మర్నాడు అలస్యంగా నిద్రలేచారు. సావకాశంగా లొకేషన్‌కి వచ్చే ప్రముఖహీరోలా స్పాట్‌కి వచ్చారు.

భవనసముదాయ నిర్మాణాలను తీరిగ్గా తిలకించారు. సిమెంటుకి, యిసుకకీ అతికష్టంమీద సయోధ్య కుదిర్చి నిర్మించినట్లుగా ప్రతి అంగుళం సాక్ష్యం పలుకుతూనే వుంది.

భైరవమూర్తిగారి నిర్మాణ కౌశలానికి ఇ.ఇ. గారు ముక్కున వేలేసుకున్నారు. రేపొద్దున్న ఈ బిల్డింగ్‌లలో చదవబోయే భావిపౌరుల భవితవ్యం కళ్లకు కట్టి ఒక్కక్షణం స్తంభించిపోయారు. తరువాత కాస్త తేరుకుని –

"అయ్యా భైరవమూర్తిగారూ! తమరు ఓసారి పైకి ఎక్కి ఆ చివర నుండి ఈ చివరకు పరిగెత్తి క్షేమంగా క్రిందికి రాగలిగితే ఈ క్షణంలోనే తమ బిల్లు సేంక్షన్ చేస్తాను!" అన్నారు నవ్వకుండా.

భైరవమూర్తిగారు నవ్వారు చిద్విలాసంగా... ఆయన నోట్లోని బంగారు పన్ను తళుక్కుమంది.

మళ్లీ మళ్లీ మళ్లీ మళ్లీ నవ్వారు.

నవ్వుని సంభాళించుకొని –

"ఏందయ్యోయ్! ఇంజనీరూ! నాతో జోకులాటాడుతున్నావేంది? ఏంటీ? నేను స్లాబ్ పైకెక్కి పరిగెత్తాలా!?

నా దగ్గర పర్సంటేజీ పట్టేసిన మీ స్టాఫ్‌ని పరిగెత్తించు! టెండరులో తన భాగం పట్టేసిన మీ మినిస్టర్నీ పరిగెత్తించు!! వాడిని మినిస్టరు

చేసిన సి.యం. ని పరిగెత్తించు!! యింకా కావలిస్తే వాళ్లకు ఓట్లేసి గెలిపించిన ఎర్రి గొర్రెల్ని పరిగెత్తించు!! అంతేగానీ నాకేటి ఖర్మ? పిల్లలుగలవాడివి. నా దగ్గర నఖరాలు చెయ్యి మాక. ముందు బిల్లు సంగతి చూడు!" అన్నారు భైరనమూర్తిగారు మీసం మెలేస్తూ.

భైరవమూర్తిగారి శక్తిసామర్థ్యాలు పూర్తిగా తెలిసొచ్చిన ఇ.ఇ. గారు బిల్లు వెంటనే సేంక్షన్ చేసి మరీ జీపెక్కాడు.

# పరుగు

కళ్లల్లోకి దుమ్ము కొడుతూ జీపు పరిగెడు తోంది!

పరుగు... పరుగు...!

